# మనం
## కరీంనగర్
జగిత్యాల- రాజన్న సిరిసిల్ల- పెద్దపల్లి -మంచిర్యాల- కొమురంభీమ్

బుధవారం | 19 | జూలై | 2023 | పేజీలు : 7


# జంక్షన్ అభివృద్ధి పనులను ప్రారంభించిన మంత్రి గంగుల




కరీంనగర్, జులై 18 (మనం న్యూస్): కరీంనగర్ అభివృద్ధి లో భాగంగా మంగళవారం నగరంలోని పద్మనగర్, కోతిరాంపూర్, సిక్ వాడీ చౌరస్తాల్లో ఐలాండ్ జంక్షన్ అభివద్ధి పనులను బిసి సంక్షేమం, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ యాదగిరి సునీల్ రావు, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూప రాణీ హరిశంకర్, కమీషనర్ సేవా ఇస్లావత్, స్థానిక కార్పొరేటర్ జంగిలి ఐలేందర్ యాదవ్, పలువురు కార్పొరేటర్లు, నగర పాలక సంస్థ అధికారులు, సిబ్బంది, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్పష్టమైన ఓటర్ల జాబితా రూపొందించాలి



## కరీంనగర్ కలెక్టర్ కర్ణన్

కరీంనగర్ బ్యూరో, జులై 18 (మనం న్యూస్): రానున్న ఎన్నికల దృష్ట్యా బిఎల్ఓ లు సమర్ధవంతమైన, స్పష్టమైన ఓటర్ల జాబితా తయారు చేయాలని జిల్లా కలెక్టర్ ఆర్.వి. కర్ణన్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఫోటో ఎలక్టోరల్ రోల్స్ 2వ ఎస్ఎస్ఆర్ 2023 పై బూత్ స్థాయి అధికారుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భగా మాట్లాడుతూ పారదర్శకమైన ఎన్నికల జాబితా తయారు చేయాలని, ఓటర్ల జాబితాలో మార్పులు చేయడంలో జాగ్రత్తవహించాలని సూచించారు. ఇంటింటి సర్వే ద్వారా ఓటర్ల జాబితాను నిర్ధారించాలని, గరుడ యాప్ లో వివరాల నమోదు సక్రమంగా జరిగేలా చూడాలని, పోలింగ్ స్టేషన్లను సందర్శించి అన్ని సౌకర్యాలు ఉన్నాయా చూసుకోవాలని, ఇంకా ఎవైన అవసరమైతే సమకూర్చాలని తెలిపారు. పొలిటికల్ పార్టీ కార్యాలయాలకు 2 కి.మి. దూరంలో, ఓటర్లకు సమీపంగా పోలింగ్ కేంద్రాలు ఉండేలా జాగ్రత్త వహించాలన్నారు. చనిపోయిన ఓటర్ల విషయంలో ఖచ్చితంగా మరణ ధృవీకరణ పత్రాన్ని పొంది, కుటుంబ సభ్యుల ద్వారా వాకబు చేసిన తరువాతే ఓటరు జాబితా నుండి వివరాలను తొలగించాలన్నారు. అనాధాలు, ఒంటరి మరియు కూలీ కొసం ఊరురూ తిరిగే వారి వివరాలను కూడా సేకరించి వారి స్థిర చిరునామా ఆధారంగా ఓటరుగా నమోదు చేయాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరిని ఓటరుగా నమోదు చేయాలని, పోలింగ్ కేంద్రం పరిధిలో ఓటరుగా ఉన్న ప్రతిఒక్కరి ఫోటో, వివరాలు సరిగా ఉండాలన్నారు.

పోలింగ్ కేంద్రాల వద్ద వికలాంగులు, వృద్దుల కొరకు ర్యాంపులతో పాటు ఇతర మౌళిక సదుపాయాలను ఖచ్చితంగా కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణ సహాయ కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో, కరీంనగర్ హుజురాబాద్ ఆర్డిఓలు ఆనంద్ కమార్, హరిసింగ్ లు, ఎస్సారార్ డిగ్రికళాశాల అసిస్టేంట్ పోఫెసర్లు మల్లారెడ్డి, శ్రీనివాస్, కలెక్టరేట్ ఎఓ జగత్ సింగ్, అసెంబ్లి లెవల్ మాస్టర్ ట్రైనర్లు, ఇతర ఎన్నికల అధికారులు పాల్గోన్నారు.

### ఎన్నికల నిర్వహణలో స్పష్టమైన

# ఓటరు జాబితా ముఖ్యం

### కలెక్టర్ హేమంత్ సహదేవరావు

2 లో




### బిఆర్ఎస్ అభివృద్ధి కావాలా..?

# కాంగ్రెస్ కుంభకోణాలు కావాలా..?

### ప్రజలే తేల్చుకోవాలి... కాంగ్రెస్‌కు ఓటేస్తే అధోగతే

### ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్

చిగురుమామిడి, జులై 18 (మనం న్యూస్): కెసిఆర్ నేతృత్వంలోని బిఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తోన్న అభివృద్ధి సంక్షేమ పథకాలు కావాలా... కుంభకోణాల చరిత్ర ఉన్న కాంగ్రెస్ పార్టీ కావాలా..? ప్రజలే నిర్ణయించుకోవాలని హుస్నాబాద్ శాసనసభ్యులు వొడితెల సతీష్‌కుమార్ అన్నారు. వ్యవసాయానికి 24 గంటలు ఉచిత విద్యుత్‌నందిస్తూ రైతన్నల ప్రయోజనాల కోసం పాటుపడుతున్న బిఆర్ఎస్ ఓ వైపు, ఉచిత విద్యుత్ అవసరం లేదంటున్న కాంగ్రెస్ మరో వైపు ఉందని, ఎవరికి మద్ధతునిస్తారో..? రైతులే నిర్ణయించుకోవాలన్నారు. మంగళవారం చిగురుమామిడి మండలంలో పలు అభివృద్ధి పనులను సతీష్‌కుమార్ ప్రారంభించారు. చిగురుమామిడి మండలం నవాబ్ పేట్, సీతారాంపూర్, లంబాడిపల్లి, గునుకులపల్లి, ముదిమాణిక్యం, గాగిరెడ్డిపల్లి గ్రామాల్లో 20 లక్షల రూపాయల చొప్పున మొత్తం కోటి 20 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణ మిగతా 5లో..



# ఎన్నికల నిర్వహణలో స్పష్టమైన ఓటరు జాబితా ముఖ్యం

### కలెక్టర్ హేమంత్ సహదేవరావు

కొమురంభీం ఆసిఫాబాద్, జులై 18 (మనం న్యూస్): ఎన్నికల నిర్వహణలో స్పష్టమైన ఓటరు జాబితా ఎంతో ముఖ్యమని జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ రాజేశం, డి.ఆర్.ఓ రాజేశ్వర్ తో కలిసి ఫొటో ఓటరు జాబితా రూపకల్పన పై ఎన్నికల అధికారులు, సహాయ ఎన్నికల అధికారులు, తహసిల్దార్లు, నాయబ్ తహసిల్దార్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏఎల్ఎంటి, డిఎల్ఎంటి శిక్షణ పొందిన వారు బూత్ స్థాయి అధికారులకు శిక్షణ ఇచ్చే సమయంలో ఓటరు జాబితా రూపకల్పన, ఓటు యొక్క విలువ తెలియజేయాలని తెలిపారు. 2వ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం కొనసాగుతున్నందున జిల్లాలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు నమోదు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మహిళలు, దివ్యాంగులు, ఆదివాసీ, ట్రాన్స్ జెండర్లు అర్హత గల వారి అందరి వివరాలు ఓటరు జాబితాలో ఉండేలా శ్రద్ధ వహించాలని తెలిపారు. ఓటరు జాబితా కచ్చితంగా, సమర్థవంతంగా ఉన్నప్పుడే ఎన్నికలు సజావుగా సాగుతాయని తెలిపారు. ఓటరు జాబితా తయారు చేయడంలో బూత్ స్థాయి అధికారుల పాత్ర కీలకమైనదని, వారికి శిక్షణ ఇచ్చే సమయంలో పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్లు, నాయబ్ తహసిల్దార్లు, ఏ.ఎల్.ఎం.టి., డి.ఎల్.ఎం.టి. లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి

### అదనపు కలెక్టర్ రాజేశం



కొమురంభీమ్ ఆసిఫాబాద్, జులై 18 (మనం న్యూస్): జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ రాజేశం అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఇన్చార్జ్ జిల్లా పంచాయతీ అధికారి సురేందర్ తో కలిసి అన్ని మండలాల మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులు, పంచాయితీ కార్యదర్శులతో గ్రామపంచాయతీలను చేపడుతున్న పారిశుధ్య నిర్వహణ కార్యక్రమాలు, హరితహారం, అంటువ్యాధుల నియంత్రణ, జూనియర్ పంచాయతీ కార్యదర్శుల క్రమబద్ధీకరణ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేశం మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున గ్రామపంచాయతీలలో పారిశుధ్య పనులను ఎలాంటి అలసత్వం లేకుండా సక్రమంగా నిర్వహించాలని, మురుగు కాలువలలో పూడిక తీయాలని, రోడ్లు, నివాస ప్రాంతాలలో వర్షపు నీరు నిలువ లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. దోమల వృద్ధిని నిరోధించేందుకు దోమల మందు పిచికారి చేయాలని, మంచినీటి బావులలో బ్లీచింగ్ పౌడర్ వేయాలని తెలిపారు. తెలంగాణకు హరితహారం కార్యక్రమం లో భాగంగా కేటాయించిన లక్ష్యాలకు అనుగుణంగా మొక్కలు నాటాలని, జూనియర్ పంచాయతీ కార్యదర్శుల క్రమబద్ధీకరణ కొరకు ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాల ప్రకారం చర్యలు చేపట్టాలని తెలిపారు. జిల్లాలో చేపట్టిన గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ ఉప వైద్యాధికారి, డివిజనల్ పంచాయతీ అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ కమిషనరేట్‌లో గ్రీన్ ఇండియా ఛాలెంజ్

### మొక్కలు నాటిన సిపి సుబ్బారాయుడు



కరీంనగర్ క్రైం, జులై 18 (మనం న్యూస్): కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కేంద్రంలో మంగళవారం గ్రీన్ ఇండియా ఛాలెంజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమీషనర్ ఏల్ సుబ్బారాయుడు కమిషనరేట్ ఆవరణలో మొక్కలను నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజ్యసభ సభ్యులు సంతోష్ కుమార్ చేపట్టిన ఈ కార్యక్రమం సమాజానికి మేలు చేకూర్చుతుందన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించి, కాలుష్య రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మానవ సమాజానికి ఆధారమైన మొక్కల పెంపకంపై అన్ని వర్గాల ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ప్రతి ఒక్క పౌరునిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డిసిపి ఎస్.శ్రీనివాస్, అడిషనల్ డిసిపి ఎం.భీంరావు, ఏసిపి సి.ప్రతాప్, ఆర్ఐలు సురేష్, మురళి, గ్రీన్ ఇండియా చాలెంజ్ కో-ఆర్డినేటర్ సతీష్ లతోపాటుగా పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఆధ్వర్యంలో...కెసిఆర్ దిష్టిబొమ్మకు ఉరి.. దగ్ధం..



జమ్మికుంట, జులై 18 (మనం న్యూస్): కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు పత్తి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం సిఎం కెసిఆర్ దిష్టిబొమ్మకు ఉరితీసి దగ్ధం చేశారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ టిపిసిసి అధ్యక్షుడు రేవంత్ రెడ్డి మాటలను వక్రీకరించి బదనాం చేసి మండలాల్లో గ్రామాల్లో రేవంత్ రెడ్డి శవయాత్రలు చేసి దిష్టిబొమ్మలు దగ్ధం చేస్తున్నారని ధ్వజమెత్తారు. సబ్ స్టేషన్లలో మినట్ బుక్ లు పరిశీలించి బిఆర్ఎస్ ప్రభుత్వం ఎన్ని గంటలు విద్యుత్ సరఫరా చేసిందో కోమటిరెడ్డి వెంకటరెడ్డి నిరూపించారని ఆయన తెలిపారు. ప్రతి కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు సబ్ స్టేషన్లలో బుక్కులను పరిశీలిస్తారని అందులో నిజా నిజాలు బయటపడతాయని ఆయన పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మపై పడి ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డి ఏడుస్తున్నాడని, దింపుడు కళ్ళెం దగ్గర చేసినట్లు దిష్టిబొమ్మ చెవిలో చెప్తుండని రేవంత్ రెడ్డికి నీకు ఏమైనా సంబంధం ఉందా అని ఘాటుగా విమర్శించారు. మర్యాదగా ప్రవర్తిస్తే మర్యాదగా ఉంటామని హద్దులు మీరి ప్రవర్తిస్తే ఖబడ్దార్ కౌశిక్ రెడ్డి అని తీవ్రంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సాయిని రవి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గూడెపు సారంగపాణి కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు పుల్లూరి సదానందం కాంగ్రెస్ పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు పూదరి రేణుక శివకుమార్ గౌడ్ కాంగ్రెస్ నాయకులు ఎండి సలీం ముద్దమల్ల రవి కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సిసి రోడ్డు పనులను ప్రారంభించిన రసమయి



మానకొండూర్, జులై 18 (మనం న్యూస్): మానకొండూర్ మండలం సదాశివపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించనున్న సి. సి రోడ్ల పనులకు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, సుడా చైర్మన్ జి వి రామకృష్ణారావు, నగర మేయర్ యాదగిరి సునీల్ రావు, కార్పొరేటర్ ఆకుల పద్మ ప్రకాష్, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షులు కముటం సంపత్, మానకొండూర్ సర్పంచ్ రొడ్డ పృథ్వీరాజ్, బీఆర్ఎస్ నాయకులు నామాల శ్రీనివాస్, సింగిరెడ్డి సంపత్ రెడ్డి, సింగిరెడ్డి అనంత రెడ్డి, ఎరుకల శ్రీనివాస్ గౌడ్, శాతరాజు యాదగిరి, రామిడి చుక్కయ్య, భాస్కర్ రెడ్డి, వాలిపాషా, షేక్మీరా, కరుణాకర్ రెడ్డి, శ్రీనివాస్, గాలిపల్లి పోచయ్య, బోడ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబాన్ని పరామర్శించిన ఆరెపల్లి మోహన్

మానకొండూరు, జులై 18 (మనం న్యూస్): మండలంలోని వన్నారం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కనకం చంద్రమౌళి మృతి చెందగా మాజీ ఎమ్మెల్యే ఆరేపల్లి మోహన్ ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. మంగళవారం మృతుని నివాసానికి వెళ్లిన ఆయన చంద్రమౌళి పార్థివ దేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆనంతరం గ్రామస్థులతో కలిసి అంతిమ యాత్రలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఓసి సామాజిక సంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు, బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు పోలాడి వంశీధర్ రావు,



అంబేద్కర్ సంఘాల అధ్యక్షుడు తాల్లపల్లి కొమురయ్య పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ఇల్లు ముట్టడించిన

# గ్రామపంచాయితీ కార్మికులు

మంచిర్యాల, జులై 18 (మనం న్యూస్)ః గ్రామ పంచాయితీ కార్మికులు నిర్వహిస్తోన్న సమ్మెలో భాగంగా తెలంగాణ గ్రామ పంచాయతీ జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తా నుండి ఎమ్మెల్యే దివాకర్‌రావు ఇంటి వరకు ర్యాలీ నిర్వహించిన కార్మికులు ఎమ్మెల్యే ఇల్లు ముట్టడించారు. అనంతరం ఎమ్మెల్యే పిఏ సల్మాన్ రాజ్ కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు దుంపల రంజిత్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మికులు గత 13 రోజుల నుంచి సమ్మె చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకున్న పరిస్థితి లేదని ఇప్పటికైనా ఎమ్మెల్యే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని అన్నారు.ఈ మధ్య కాలంలో దండేపల్లి మండలం రాజంపేట గ్రామానికి చెందిన గంగాధరి మల్లేష్ అను కార్మికుడు విధుల్లో కరెంటు పోల్ ఎక్కిన సందర్భంలో విధ్యుత్ షాక్ గురై చనిపోవడం జరిగిందనీ. చనిపోయిన కార్మికుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని తక్షణమే కుటుంబానికి 25 లక్షలు ఎక్స్ గ్రేషియా చెల్లించి, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని. గ్రామపంచాయతీ కార్మికులు 11వ పి.ఆర్.సిని వర్తింపజేయాలని పోరాటాలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. మల్టీ పర్పస్ వల్ల కారోబార్,బిల్ కలెక్టర్ల పరిస్థితి దారుణంగా తయారైందని అన్నారు.ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలకు,నిర్వహణకు , గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడానికి నిత్యం కృషి చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులపై రాష్ట్ర ప్రభుత్వం జివో నెంబర్ 48 ని తీసుకువచ్చి పాఠశాలలను, ప్రభుత్వ కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచాలని అదనపు పని బారాన్ని వేసింది. తప్ప వేతనాలను చెల్లించడంలో ఇతర సమస్యలను పరిష్కరించడంలో చొరవ చూపలేదు అన్నారు.జివో నెంబర్ 51 తీసుకువచ్చి కార్మికుల పని భద్రతను దూరం చేసి మల్టీపర్పస్ వర్కర్స్ గా మార్చివేసి పని భారాన్ని పెంచిందని మండిపడ్డారు . గ్రామ పంచాయతీ కార్మికులకు కనీస వేతనం జీవో నెంబర్ 60 ప్రకారము



16,500 ఇవ్వాలని, గ్రామపంచాయతీ కార్యదర్శులకు ప్రత్యేక అధికారులుగా నియమించాలి. ప్రస్తుతం వచ్చే వేతనాలు కుటుంబ పోషణకు సరిపోక గ్రామపంచాయతీ కార్మికులు అనేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీ కార్మికులందరికీ కనీస వేతనం 26 వేల రూపాయలు చెల్లించాలని,పిఎఫ్ ఈఎస్ఐ మరియు పెన్షన్ ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పించాలని, ప్రమాద భీమా 10 లక్షల రూపాయలు చెల్లించాలని, 60సంవత్సరాలు నిండిన వారికి ఐదు లక్షల రూపాయల రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇస్తూ వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెను ఉదృతం చేస్తామని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో లక్షెట్టిపెట్, దండేపల్లి, హాజీపూర్ మండలాల గ్రామ పంచాయతీ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు అన్ని గ్రామాల కారోబార్లు, బిల్ కలెక్టర్లు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళా సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత



రాజన్న సిరిసిల్ల, జులై 18 (మనం న్యూస్): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతకు మొదటి నుండి అధిక ప్రాధాన్య ఇస్తుందని పురపాలక సంఘ అధ్యక్షురాలు జిందం కళ అన్నారు. సిరిసిల్ల పట్టణంలో సక్సెస్ ఇనిస్ట్యూట్ ఆఫ్ బ్యూటీ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో ఈ నెల 23న నిర్వహించబోయే వన్డే స్కిల్ సర్టిఫికెట్ కోర్స్, బ్యూటీ అండ్ వెల్నెస్ అవగాహన కార్యక్రమం వాల్ పోస్టర్లను ఆమె మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా కళ మాట్లాడుతూ కేసీఆర్ తెలంగాణ రాష్ట్రంలో మహిళల ఆర్థిక ఎదుగుదలకు, విద్యాభివృద్ధికి రక్షణకు అధిక ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. ఇందులో భాగంగా మహిళా సాధికారత కోసం మంత్రి కేటీఆర్ మహిళలు ఆర్థికంగా ఎదగాలనే మంచి ఆలోచనతో వి హబ్ ప్రారంభించి, ఎంతోమంది ఆలోచనలను పదును పెట్టేలా, వారు ఎంచుకున్న రంగాల లో ఉన్నత లక్ష్యాలను చేరుకునేలా స్ఫూర్తిదాయకంగా నిలిచారన్నారు. మంత్రి కేటీఆర్‌ను స్ఫూర్తిగా తీసుకొని నేటి ఆధునిక ప్రపంచంలో దినదినాభివృద్ధి చెందుతూ భవిష్యత్తులో వేలాది ఉపాధి అవకాశాలు సృష్టించబోయే బ్యూటీషన్ రంగం గురించి స్థానిక మహిళలకు అవగాహన కల్పించేలా సక్సెస్ ఇనిస్ట్యూషన్స్ ఆఫ్ బ్యూటీ సొల్యూషన్స్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషించదగ్గ విషయమన్నారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొవాలన్నారు. సక్సెస్ ఇనిస్టిట్యూట్ బ్యూటీ సొల్యూషన్స్ ఆర్గనైజర్ స్వప్న రావు మాట్లాడుతూ మంత్రి కేటీఆర్ స్ఫూర్తిదాయక కార్యక్రమాల ద్వారా ఆయన పుట్టినరోజును పురస్కరించుకొని వన్ డే స్కిల్ సర్టిఫికెట్ కోర్స్ అండ్ బ్యూటీ వెల్నెస్ అవగాహన కార్యక్రమాన్ని సిరిసిల్లలో నిర్వహిస్తున్నామన్నారు. మహిళలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



## జాతీయ స్థాయి పోటీలకు ఆల్ఫోర్స్ విద్యార్థులు

### విద్యార్థులను అభినందించిన అధినేత నరేందర్‌రెడ్డి

సుల్తానాబాద్,జూలై 18 మనం న్యూస్ ః తమిళనాడు రాష్ట్రంలో జరగనున్న జాతీయ స్థాయి టగ్ ఆఫ్ వార్ పోటీలకు ఆల్ఫోర్స్ విద్యార్థులు ఎంపికయ్యారని విద్యాసంస్థల అధినేతని నరేందర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ కేవలం చదువులకే పరిమితం కాకుండా విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దుతున్నామని నిష్ణాతులైన శిక్షకుల చే శిక్షణ ఇప్పించడంతో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని రాష్ట్ర జాతీయ స్థాయి పోటీల్లో రాణిస్తున్నారని తెలిపారు. హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి టగ్ ఆఫ్ వార్ ఎంపిక పోటీల్లో పాల్గొని జాతీయస్థాయి పోటీలకు సుల్తానా బాద్ ఆల్ఫోర్స్ విద్యార్థినిలు జె.రుక్మిణి, బి.సిరి,ఎన్. నికిత,పి. సహస్రలు ఎంపికయ్యారని తెలిపారు. తమిళనాడు రాష్ట్రంలోని నమ్మకల్ జిల్లా తిరుచున్ గోడు పట్టణంలో ఈ నెల 20 నుంచి 24 వరకు జరగనున్న పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక ఆల్ ఫోర్స్ పాఠశాలలో విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షులుగా నయీం



మందమర్రి, జులై 18 (మనం న్యూస్)ః మందమర్రి పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షులుగా ఎండి.నయీం నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ప్రేమ్‌సాగర్ రావు మంగళవారం నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా నయీమ్ మాట్లాడుతూ తన మీద నమ్మకంతో యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షునిగా నియామకం చేసినందుకు కృతజ్ఞతలు తెలియ జేశారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తనవంతుగా మందమర్రి పట్టణం లో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కొరకు కృషి చేస్తానని అన్నారు. తన ఈ నియామకానికి సహకరించిన పీసీసీ మెంబర్ నూకల రమేష్ ,యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు శివ సేన రెడ్డి , జిల్లా అధ్యక్షులు సంపత్ రెడ్డి, మందమర్రి పట్టణ అధ్యక్షుడు నోముల ఉపేందర్, టిపిసిసి సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి ఎండి ముజహిద్, మహిళా కాంగ్రెస్ పట్టణ అధ్యక్షురాలు గడ్డం రజని, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షులు నేరువట్లా శ్రీనివాస్, పట్టణ కాంగ్రెస్ కమిటీ నాయకులందరికీ ధన్యవాదాలు తెలిపారు.

## అర్హులందరికీ బిసి బంధు ఇవ్వాలి



రామడుగు, జులై 18 (మనం న్యూస్)ః ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రక టించిన బిసి బందును దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి అందజే యాలని రామడుగు మండల కాం గ్రెస్ పార్టీ అధ్యక్షులు బొ మ్మరవేని తిరుపతి ముది రాజ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మం గళ వారం జరిగిన సమా వేశంలో ఆయన మాట్లాడు తూ మండలంలో బందు కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి బీసీ బందును ఒకేసారి అందజేయాలని, లేనిపక్షంలో తహసిల్దార్ కార్యాలయంతో పాటు ఎమ్మెల్యే ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు.

## గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే ప్రభుత్వ లక్ష్యం



వెల్గటూర్, జులై 18 (మనం న్యూస్): గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్దే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. మంగళవారం కరీంనగర్ లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఎండపల్లి మండలం గుళ్ళకోట గ్రామం లో వైకుంఠ ధామం నుండి చుంచు భూమయ్య ఇంటి వరకూ మెటల్ రోడ్డు నిర్మాణానికి సంబంధించి 5 లక్షల రూపాయల మంజూరు పత్రాలను మంత్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు సిం హాచలం జగన్, పొన్నం తిరుపతి గౌడ్, వనం రామయ్య,చుంచు మల్లేశం,గొల్లపల్లి రాజు గౌడ్, పడిదం వెంకటేష్,బట్టు రామస్వామి ,గుల్లకోట, చెర్లపల్లి రైతులు పాల్గొన్నారు.

## భూకబ్జాలకు పాల్పడిన నాయకులపై

# లోకాయుక్తలో ఫిర్యాదు

### కబ్జాకు గురైన భూమిని స్వాధీనం చేసుకుని నిందితులపై కఠిన చర్యలు చేపట్టాలి

### ఎఎంసి మాజీ చైర్మన్ సమ్మిరెడ్డి, బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు రాజ్‌కుమార్




జమ్మికుంట, జులై 18 (మనం న్యూస్)ః జమ్మికుంట పట్టణం సర్వే నెంబర్ 629, 887 లలో ఎంఎల్ ఏ ఈటెల రాజేందర్ అనుచరులు జీవో నెంబర్ 59, 58 ని అడ్డంపెట్టుకొని దాదాపు 5 ఎకరాల భూమిని కబ్జా చేశారని పేర్కొంటూ జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి, బిఆర్ఎస్ పట్టణ శాఖ అధ్యక్షులు టంగుటూరి రాజ్ కుమార్ లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ కబ్జా చేసిన భూమిని ప్రభుత్వ అధికారులు స్వాధీనం చేసుకొని కబ్జా చేసిన వారిని కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ భూమిలో ఎలాంటి ఇండ్ల నిర్మాణం చేయకున్నా నాయకుల పైరవీతో మున్సిపల్ అధికారులు ఇంటి నెంబర్ల ను అలాట్ చేశారని ఆరోపించారు. 2014లో జీ ఓ నెంబర్ 59, 58 ను కేవలం 125 గజాల లోపు ఉన్న పేదవారికి వాటిని క్రమబద్ధీకరణ చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇస్తే దీన్ని బేఖాతర్ చేసి రెవెన్యూ అధికారుల మీద ఒత్తిడి తెచ్చి ఎంఎల్ ఏ అనుచరులు స్వాధీనం చేసుకున్నారన్నారు. పాత రెవెన్యూ అధికారుల సంతకాలతో ,ఇంతకు ముందు పనిచేసిన వారి పరిచయాలతో సర్వే నెంబర్ 629, 887 లలో పేద వారికి చెందాల్సిన భూములను ఎం ఎల్ ఏ అనుచరులు కబ్జా చేశారని ఆరోపించారు. ఇప్పటి వరకు పేదల కోసం ఒక్క వైకుంఠ ధామము కూడా సరిగా లేదని దాదాపు 20 ఏళ్ల నుండి ఎంఎల్ ఏ, మంత్రిగా పనిచేసిన ఈటల రాజేందర్ తన అనుచరులకు మాత్రం వేల గజాల భూమిని ఇప్పించారని పేర్కొన్నారు. జీ ఓ నెంబర్ 58,59 ను అడ్డం పెట్టుకొని సర్వే నెంబర్ 629 లో దాదాపు 6000 గజాల స్థలంలో ఎలాంటి ఇండ్ల నిర్మాణం లేకుండానే ఇంటి నెంబర్ పొంది దాదాపు 3 కోట్ల రూపాయల విలువైన పేద వాళ్ళకు చెందాల్సిన భూమిని స్వాధీనం చేసుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. పేదలకు చెందాల్సిన భూమినీ ఎం ఎల్ ఏ అనుచరులు స్వాధీనం చేసుకోకుండా తాము లోకాయుక్త లో కేసు వేశామని, ఇకనైనా ఎం ఎల్ ఏ కల్పించుకొని పేదలకు చెందాల్సిన భూమిని వారి అనుచరుల దగ్గర నుండి ఆక్రమణ చేసిన భూములను రద్దు చేయించి పేదలకు ఇప్పించాలని వారు డిమాండ్ చేశారు.

## పూర్తి స్థాయి సౌకర్యాలతో

# విద్యాబోధన సాగాలి

### కలెక్టర్ హేమంత్ సహదేవరావు



కొమురంభీమ్ ఆసిఫాబాద్, జులై 18 (మనం న్యూస్)ః విద్యార్థులకు పూర్తిస్థాయి సౌకర్యాలతో విద్యాబోధన చేయాలని కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు. మంగళవారం జిల్లాలోని కాగజ్ నగర్ పట్టణం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, వసతి గృహం, బెజ్జూర్ మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల, చింతల మానేపల్లి మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, కౌటాల మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం పాఠశాలలను ఎమ్మెల్యే కోనేరు కోనప్పతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు పూర్తిస్థాయి సౌకర్యాలతో నాణ్యమైన విద్యాబోధన చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. పిల్లలకు మెనూ ప్రకారం పౌష్టిక ఆహారాన్ని అందించాలని, విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు అందించాలని తెలిపారు. పాఠశాల పరిసర ప్రాంతాలలో పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అనంతరం పెంచికల్ పేట వద్ద పెద్దవాకపై నిర్మించే బ్రిడ్జి అప్రోచ్ రోడ్డు, బెజ్జూర్ మండలంలోని సలుగు పల్లి-పెంచికల్ పేట రహదారిపై నిర్మించిన వంతెన పనులను పరిశీలించారు. వంతెన నిర్మాణ పనుల కారణంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అప్రోచ్ రోడ్డును ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.

# అభివృద్ధి పేరిట దోచుకుంటున్నారు...

- సర్క్యూట్ గెస్ట్ హౌస్‌కు పదిహేను కోట్ల ఖర్చా..?
- మూడు కూడళ్ల సుందరీకరణకు ఆరున్నర కోట్లా..?
- బిఆర్ఎస్ అవినీతి, కబ్జాలు, డొల్ల అభివృద్ధిని బహిర్గతం చేస్తాం

**నగర కాంగ్రెస్ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి**

కరీంనగర్ కలెక్టరేట్, జులై 18 (మనం న్యూస్)ః కరీంనగర్ నగర పరిధిలో అభివృద్ధి కార్యక్రమాల పేరిట బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు దోపిడీకి పాల్పడుతున్నారని కరీంనగర్ సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఆరోపించారు. కరీంనగర్ సర్క్యూట్ గెస్ట్ హౌస్‌కు పదిహేను కోట్ల రూపాయలు, మూడు కూడళ్ల సుందరీకరణ పనులకు ఆరున్నర కోట్ల రూపాయలు వ్యయమైనట్లు లెక్కలు చూపించడంలోనే వారి అవినీతి తెలుస్తోందన్నారు. అభివృద్ధి కార్యక్రమాల మాటున బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు చేస్తోన్న అవినీతి, కబ్జాలు, డొల్ల అభివృద్ధిని త్వరలోనే ప్రజల సమక్షంలో బహిర్గతం చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. మంగళవారం స్థానిక ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నరేందర్ రెడ్డి మాట్లాడుతూ అవసరం లేని పనులకు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోన్న మంత్రి గంగుల కమలాకర్‌కు పేదల డబుల్ బెడ్రూం ఇండ్లు పూర్తి చేయడానికి నాలుగు కోట్లు ఖర్చు చేయడానికి ఎందుకు మనసు రావడంలేదని ప్రశ్నించారు. శివారు కాలనీలు, విలీన గ్రామాల పరిధిలో పైప్ లైన్లు వేయకపోవడం వల్ల మంచి నీళ్లకు ఇబ్బందులు పడుతున్నారని, రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయని, నగరంలో చాలా ప్రాంతాల్లో రోడ్లు, మురికి కాలువలు దెబ్బ తిని ప్రజలు నానా అవస్థల పాలవుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. స్మార్ట్ సిటీ పనుల కింద చేపట్టిన పుట్ పాత్‌లు, రోడ్లు, పబ్లిక్ టాయిలెట్లు ఏడాది తిరగకముందే అస్తవ్యస్తంగా తయారయ్యాయని పేర్కొంటూ, వాటికి సంబంధించిన ఫొటోలను ప్రదర్శించారు. మసి పూసి మారేడు కాయ చేసి చూపించి ఇదే అభివృద్ధి అని చెప్తున్నారని, ఖాజీపూర్ వక్ఫ్ బోర్డు ఆస్తి కాజేసినట్టు పూర్తి ఆధారాలున్నాయని, అన్ని కూడా ప్రజలకు డాక్యుమెంట్ రూపంలో అందజేస్తామని నరేందర్ రెడ్డి స్పష్టం చేశారు. జగిత్యాలలో మంత్రి కెటిఆర్ స్థాయికి మించి మాట్లాడారని, రాహుల్ గాంధీ గురించి మాట్లాడే స్థాయి ఆయనది కాదని అన్నారు. ఎద్దు ఏవుసమే కాదు ఈ దేశానికి దిక్సూచి కూడా రాహుల్ గాంధీయే అని స్పష్టం చేశారు. సిరిసిల్ల లో కెకె మహేందర్ రెడ్డి నోటి కాడి బుక్క గుంజుకొని ఎమ్మెల్యే అయిన కెటిఆర్ రెండు సార్లు ప్రధాన మంత్రి అవకాశం వచ్చినా వదిలి పెట్టిన రాహుల్ గాంధీని విమర్శించడమేంటని నరేందర్ రెడ్డి ప్రశ్నించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు సమద్ నవాబ్, శ్రవణ్ నాయక్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, దండి రవీందర్,సలిమొద్దిన్,షబానా మహమ్మద్,ముల్కల కవిత,ఊరడి లత,దన్న సింగ్,మామిడి సత్యనారాయణ రెడ్డి,చంద్రయ్య గౌడ్,ముక్క భాస్కర్,లయక్, కంకణాల అనిల్ కుమార్,మెతుకు కాంతయ్య,షేక్ శేహెన్ష,రాజ్ కుమార్,కాంపల్లి కీర్తి కుమార్,ఇమామ్,అశ్రాఫ్,తమ్మడి ఎజ్రా, అబ్దుల్ భారీ,హనీఫ్,హాసన్ తదితరులు పాల్గొన్నారు.



## కెటిఆర్ దిష్టిబొమ్మ దహనం



ఇల్లంతకుంట, జులై 18 (మనం న్యూస్)ః రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం కెటిఆర్ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మానకొండూర్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు అంతగిరి వినయ్ కుమార్ మాట్లాడుతూ మంత్రి కేటీఆర్ రాహుల్ గాంధీ పట్ల అనుచితంగా మాట్లాడడమే కాకుండా వ్యవసాయంపై కాంగ్రెస్ పార్టీకి అవగాహన లేదని మాట్లాడం ఆయన అవగాహన లేమికి నిదర్శనమన్నారు. ఈ దేశంలో హరిత విప్లవం, క్షీర విప్లవం తెచ్చి అనేక సాగు నీటి ప్రాజెక్టులను నిర్మించి వ్యవసాయాన్ని పండుగలా మార్చిన ఘనత కాంగ్రెస్ పార్టీది అని గుర్తు చేశారు. నేడు ప్రపంచంలోనే 250 దేశాలకు ఆహార ధాన్యాలు ఎగుమతి చేసే స్థాయికి ఎదిగింది, నాగార్జున సాగర్, శ్రీశైలం, శ్రీరామ్ సాగర్ లాంటి అనేక ప్రాజెక్టులు నిర్మించిన ఘనత కాంగ్రెస్‌దేనన్నారు. రైతుల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేసింది, దేశ వ్యాప్తంగా ఏక కాలంలో రుణమాఫీ చేసి రైతులను రుణ విముక్తులను చేసింది కాంగ్రెస్ పార్టీనే అని ఆయన వివరించారు. దేశంలో మొదటిసారిగా ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ లో వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఇచ్చి విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది కాంగ్రెస్ హయాంలోనే అని వినయ్ కుమార్ పేర్కొన్నారు. ఇలాంటి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన కాంగ్రెస్ పార్టీని అమెరికాలో హోటల్లో పని చేసిన కెటిఆర్ విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. జాతీయ నాయకుడు రాహుల్ గాంధీ పట్ల విమర్శలకు పాల్పడే కనీస నైతికత కెటిఆర్‌కు లేదని, మరోసారి ఇలాంటి వ్యాఖ్యలకు పాల్పడితే తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు పసుల వెంకటి, అంతగరి బాలపోచయ్య, మైనార్టీ సెల్ అధ్యక్షుడు జమాల్ , యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఎర్రోజు సంతోష్ , పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మామిడి నరేష్ , గ్రామ శాఖల అధ్యక్షులు దూస రాజు, బడుగు లింగం,వడ్డే కోటేశ్వర్, రాజేందర్ రెడ్డి, బద్దం హన్మంత రెడ్డి, రమణ రెడ్డి, న్యాత బాబు తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ అభివృద్ధి కావాలా..?

# కాంగ్రెస్ కుంభకోణాలు కావాలా..?

మొదటి పేజీ తరువాయి..

పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సతీష్ కుమార్ మాట్లాడుతూ ఐదు దశాబ్దాల పాలనలో వ్యవసా యాన్ని తీవ్ర నిర్లక్ష్యం చేసి, రైతులను గోసపెట్టిన కాంగ్రెస్ పార్టీ, ఇప్పటికీ అదే ఆలోచన సాగిస్తోందన్నారు. కాంగ్రెస్ నాయకులు నిస్సిగ్గుగా, నిర్లజ్జగా మాట్లాడిన మాటలు వ్యవసాయంపై కాంగ్రెస్ నేతల అవగాహన లేమికి నిదర్శనమని మండిపడ్డారు. ఐదు దశాబ్దాలపాటు కాంగ్రెస్ పార్టీ కరెంటు, ఎరువులు, నీళ్ల ఇవ్వకుండా, ప్రాజెక్టులు కట్టకుండా, చెరువులు బాగుచేయకుండా వ్యవసాయాన్ని అధోగతి పాలు చేసి, రైతన్నల ఆత్మహ త్యలకు కారణమైందని ధ్వజమెత్తారు. ఇప్పుడిప్పుడే కుదటపడుతున్న తెలంగాణ రైతుల కడుపులు కొట్టేవిధంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతున్నారని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం మీద అవగాహన లేని వ్యక్తి రేవంత్ రెడ్డి అని, కాంగ్రెస్ మాటలు నమ్మి మోసపోతే గోస పడతామని ఒక్కసారి ప్రజలు, రైతులు ఆలోచన చేయాలని కోరారు. రైతులకు మూడు గంటల కరెంట్ చాలన్న వ్యాఖ్యలపై రైతులకు కాంగ్రెస్ పార్టీ, రేవంత్ రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కరెంటు పరిస్థితులపై రైతులు గుండెలపై చేతులు వేసుకొని ఆత్మపరిశీల చేసుకోవాలని కోరారు. ఆరు గంటలపాటు కరెంట్ ఇస్తానన్న కాంగ్రెస్, ఏనాడైనా మూడుగంటల పాటైనా ఇచ్చిం దా? అని ఆయన ప్రశ్నించారు. నాడు నాట్లు వేసే కాలం వచ్చిందంటే ఎరువుల దుకాణాల ముందు చెప్పుల వరుసలు, విత్తనాల దుకాణాల ముందు క్యూలైన్లు ఉండేవి కావా అని ప్రశ్నించారు. ఎండకాలం వచ్చిందంటే ఎండిన పంటలు, సబ్ స్టేషన్ల ముందు ధర్నాలు నిత్యకృత్యమయ్యేవని గుర్తుచేశారు. 2014 తర్వాత సీఎం కేసీఆర్ నేతృత్వంలో ఒకవైపు సాగునీటి ప్రాజెక్టులు, మిషన్ కాకతీయతో చెరువులను బాగుచేస్తూనే.. మరోవైపు రైతుబంధు వంటి విప్లవాత్మక పథకాలు అమలుచేశామని సతీష్‌కుమార్ వివరించారు. కేసీఆర్ రైతులకు కొండంత అండగా నిలిచి అన్ని విధాలుగా ఆదుకుంటుంటే, కాంగ్రెస్ పార్టీ మాత్రం రైతుల పొట్టగొట్టేందుకు చూస్తుందని మండిపడ్డారు. కాంగ్రెస్ పాలనలో కరెంట్ లేక రైతులు అరిగోస పడ్డారని, స్వరాష్ట్రంలో పుష్కలంగా సాగునీరు, నాణ్యమైన నిరంతర కరెంట్ సరఫరాతో ఆర్థికంగా ఎదుగుతున్న రైతులను మళ్ళీ చీకట్లోకి నెట్టేసే కాంగ్రెస్ పార్టీ ప్రయత్నాలను ప్రజలు తిప్పికొడతారని హెచ్చరించారు. మొదటి నుంచి కాంగ్రెస్ కు రైతులంటే చిన్నచూపని, మొన్న ధరణి వద్దన్నారని, ఇప్పుడు వ్యవసాయానికి మూడు గంటల విద్యుత్ సరఫరా సరిపోతుందని చేసిన వ్యాఖ్యలు చూస్తుంటే ... కాంగ్రెస్ రైతు వ్యతిరేక పార్టీ అని అర్థమవుతుందని ఎమ్మెల్యే వ్యాఖ్యానించారు.



దేశంలో ఏ రాష్ట్రంలో లేనటువంటి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేసుకుంటున్నామని అవన్నీ రేవంత్ రెడ్డి జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనటువంటి విధంగా వ్యవసాయానికి ఉచిత 24 గంటల కరెంటు ఇస్తున్న కెసిఆర్ ప్రభుత్వమే రైతులు కోరుకుంటున్నారని, ఆనాడు కెసిఆర్ 24 గంటల కరెంటు ఇస్తామని అంటే ఇదే కాంగ్రెస్ వాళ్లు ఎద్దేవా చేశారని కానీ కెసిఆర్ అన్న మాట ప్రకారం చేసి చూపించారని ఈరోజు కరెంటు ఉత్పాదకత, వినియోగంలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం మొదటి స్థానంలో ఉందన్నారు. కాంగ్రెస్ వాళ్లకు అధికారం కావాలని, బిఆర్ఎస్ పార్టీకి ప్రజల సంక్షేమం కావాలని, ఎన్నికలప్పుడు వచ్చే టూరిస్టులు కావాలా..? ఎప్పుడూ ప్రజా సంక్షేమం గురించి ఆలోచించే ప్రజల మధ్యనే ఉండే బీఆర్ఎస్ పార్టీ వాళ్ళు కావాలా ప్రజలందరూ విజ్ఞతతో ఆలోచించాలన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పి బంగాళఖాతంలో కలపాలని రైతాంగానికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొత్త వినిత శ్రీనివాస్ రెడ్డి, జడ్పిటిసి సభ్యులు గీకురు రవీందర్, సింగిల్ విండో చైర్మన్ జంగా వెంకటరమణ రెడ్డి, రైతు సంఘం జిల్లా బాధ్యులు సాంబారు కొమురయ్య, మండల రైతు సంఘం కోఆర్డినేటర్ పెనుకుల తిరుపతి, వైస్ ఎంపీపీ బేతి రాజిరెడ్డి, సర్పంచ్ సుద్దాల ప్రవీణ్,ఎంపీటీసీ మంకు స్వప్న శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ యార్డ్ వైస్ ప్రెసిడెంట్ శ్రీరామోజు రజిత కృష్ణమాచారి, జిల్లా నాయకులు కొత్త శ్రీనివాస్ రెడ్డి, టిఆర్ఎస్ ప్రెసిడెంట్ మామిడి అంజయ్య, పెద్దపల్లి భవాని అరుణ్ కుమార్, శ్రీరామోజు కృష్ణమాచారి తదితరులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే బిఆర్ఎస్ ప్రభుత్వ ధ్యేయం

## హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీష్ కుమార్

చిగురుమామిడి, జులై 18 (మనం న్యూస్): రాష్ట్రంలోని నిరుపేదల సంక్షేమమే బిఆర్ఎస్ ప్రభుత్వ ధ్యేయమని హుస్నాబాద్ శాసనసభ్యులు వొడితెల సతీష్‌కుమార్ స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల శ్రేయస్సే ధ్యేయంగా దేశంలోని ఏ రాష్ట్రంలో అమలు చేయని సంక్షేమ పథకాలను కెసిఆర్ అమలుచేస్తున్నారన్నారు. మంగళవారం చిగురుమమామిడి మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో మండల పరిధిలోని 15 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి పథకం చెక్కులతో పాటు 12 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైనా 3 లక్షల 96 వేల రూపాయల విలువ గల చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో సతీష్‌కుమార్ మాట్లాడుతూ కెసిఆర్ ప్రతిష్టాత్మకంగా కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను అమలుచేస్తూ, అనేక మంది నిరుపేద కుటుంబాలకు చెందిన ఆడ పిల్లల పెళ్లిళ్లకు బాసటగా నిలుస్తున్నారని కొనియాడారు. చిగురుమామిడి మండలంలో ఇప్పటి వరకు 1,517 మంది కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులకు 14 కోట్ల 33 లక్షల 73 వేల 460 రూపాయల చెక్కులు పంపిణీ చేసినట్లు వివరించారు. అలాగే అనారోగ్యాల బారిన పడ్డ పేద ప్రజలను ఆదుకునేందుకు అమలు చేస్తోన్న సిఎం సహాయనిధి పథకం ద్వారా అనేక మందికి ప్రయోజనం కలుగుతోందని తెలిపారు. ముఖ్యమంత్రి కెసిఆర్ అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తూ రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్‌గా తీర్చిదిద్దుతున్నారని కొనియాడారు. ప్రజలకు కావాల్సిన సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యలకు ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపుతోందని ఆయన పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ఇంకా మరెన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దనున్నట్లు సతీష్‌కుమార్ హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కొత్త వినిత, జెడ్పిటిసి




సభ్యులు గీకురు రవీందర్, సింగిల్ విండో చైర్మన్ జంగా వెంకటరమణారెడ్డి, తాసిల్దార్ జయంత్, ఎంపీడీవో నరసయ్య, డిప్యూటీ తహసిల్దార్ కుంభాల రవి, వైస్ ఎంపిపి బేతి రాజిరెడ్డి, జిల్లా రైతు సంఘం జిల్లా బాధ్యులు సాంబారి కొమురయ్య, మండల రైతు సంఘం బాధ్యులు పెనుకుల తిరుపతి, టిఆర్ఎస్ జిల్లా నాయకులు కొత్త శ్రీనివాస్ రెడ్డి, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్‌పర్సన్ శ్రీ రామోజీ రజిత కృష్ణమాచారి, టిఆర్ఎస్ మండల అధ్యక్షులు మామిడి అంజయ్య, తెలుగు యువత మండల అధ్యక్షులు పెద్దపల్లి అరుణ్ కుమార్, బెజ్జంకి రాంబాబు, మంకు శ్రీనివాస్ రెడ్డి, మహిళా నాయకురాలు తూముల మమత, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మంత్రి కొప్పులను కలిసిన ధర్మపురి మున్నూరు కాపు కమ్యూనిటీ



ధర్మపురి,జూలై 18 మనం న్యూస్ : నూతనంగా ఎన్నికైన ధర్మపురి పట్టణ మున్నూరు కాపు సంఘం పాలకమండలి సభ్యులు గౌరవప్రదంగా సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ని కరీంనగర్ క్యాంప్ ఆఫీస్‌లో బొకే ఇచ్చి కలవడం జరిగింది. అనంతరం మంత్రి నూతనంగా ఎన్నికైన పాలకమండలి సభ్యులను అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు చీపిరి శెట్టి రమేష్,ప్రధాన కార్యదర్శి బండారి లక్ష్మణ్,ఆర్థిక కార్యదర్శి కాశెట్టి రాంబాబు,ఉపాధ్యాయులు సోమిశెట్టి శివసాయి, స్తంభంకాడి మహేష్,సంయుక్త కార్యదర్శులు ఓడ్నల భూమేష్, పానుగంటి రవి,కార్యదర్శిలు చుక్క రవి,చల్ల రవి,చుక్క భీమ్ రాజ్,బండారి తిరుపతి,కార్యవర్గ సభ్యులు సోమిశెట్టి శేఖర్,కాశెట్టి విజయ్ కుమార్ పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ అందజేసిన సర్పంచ్




రామగిరి,జూలై 18 మనం న్యూస్ : రామగిరి మండలం రత్నాపూర్ గ్రామపంచాయతీకి చెందిన కోవ్వూరి సురేష్‌కి రూ. 18వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును మంగళవారం గ్రామపంచాయతీ ఆవరణలో సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు,ఎంపిటిసి ధర్మల రాజసంపత్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ దుబ్బాక సత్యారెడ్డి,వార్డ్ సభ్యులు ఉడుత శంకర్,బొంగురాల రవి,కుంట సదాలక్ష్మి,బిఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు బాద్రపు ప్రశాంత్‌రావులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయితీ కార్మికుల వినూత్న నిరసన



జమ్మికుంట, జులై 18 (మనం న్యూస్): గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని పేర్కొంటూ కార్మికులు మంగళవారం ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలిపారు. తెలంగాణ రాష్ట్ర గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మికుల సంఘాల జెఎసి ఆధ్వర్యంలో జరుగుతున్న సమ్మె మంగళవారానికి 13వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్మికులకు పిఆర్సి ప్రకారం 19500 వేతనం చెల్లించాలని, ప్రమాద బీమా సౌకర్యం 10 లక్షలు బీమా కల్పిస్తూ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని భారీ వర్షాన్ని కూడా లెక్కచేయకుండా సమ్మె కొనసాగించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి ఎండిగ రవీందర్రావు ఆసాల సారయ్య ముత్యాల పరుశరాములు సతీష్ తిరుపతి భద్రయ్య సారయ్య రాజన్న సమ్మెలో 52 మంది గ్రామపంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు 24 గంటలు విద్యుత్ అందించిన పార్టీ బిఆర్ఎస్

## రైతులను కాల్చుకు తిన్న రాబందులు కాంగ్రెస్ పార్టీ నాయకులు

## మూడు పంటలు పండించడమే తెలంగాణ రైతాంగ ధ్యేయం

## రైతులపై కాంగ్రెస్ ది కపట ప్రేమ... పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి



సుల్తానాబాద్,జూలై 18 మనం న్యూస్ : తెలంగాణ రాష్ట్రంలో రైతన్నలకు 24 గంటల విద్యుత్తును అందించి మూడు పంటలు పండించాలన్న సంకల్పమే బిఆర్ఎస్ లక్ష్యం అని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. మంగళవారం సుల్తానాబాద్ మండలంలోని సుద్దాల గ్రామ రైతు వేదికలో బిఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు,నాయకులు,కార్యకర్తలతో నిర్వహించిన రైతన్న,మేలుకో సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో రైతన్నలు మూడు పంటలు పండించే విధంగా ప్రాజెక్టుల రూపకల్పన చేసి నిరంతరం నీరుతో పాటు 24 గంటలు విద్యుత్ ను అందించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి కృషి చేస్తుంటే అధికారంలోకి రాకముందే రైతున్నలపై ఉన్న కపట ప్రేమను కాంగ్రెస్ పార్టీ నాయకులు బయటపెట్టారని అన్నారు. రైతులకు మూడు గంటలు విద్యుత్ ఇస్తే సరిపోతుంది అని మాట్లాడడం వారి అవివేకానికి నిదర్శనం అన్నారు. రైతులను కాల్చుకు తిన్న రాబందులు కాంగ్రెస్ పార్టీ నాయకులు అని కాంగ్రెస్ పాలనలో పవర్ హాలిడేలు క్రాప్ట్ హాలిడేలు ఉండేవని దేశానికి అన్నం పెట్టే రైతన్నకు మూడు గంటలు విద్యుత్తు ఇస్తే సరిపోతుంది అనడం వారి జీవితాలతో చెలగాటం ఆడడం కాంగ్రెస్ నైజం అని అన్నారు. అలాంటి కాంగ్రెస్ పార్టీని రాబోయే ఎన్నికలలో తరిమి కొట్టాలని పేర్కొన్నారు. రైతున్నలపై అనుషిత వాక్యాలు చేసిన కాంగ్రెస్ అధినేత రేవంత్‌రెడ్డి నిజస్వరూపం బయటపడిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతులు పండించిన పంటలు ఎండి వారి కంట కన్నీరు వచ్చిందని అన్నారు. రైతులు అప్పులు తెచ్చి మిత్తిలు కట్టలేక గుండెలు ఆగిపోయాయని పేర్కొన్నారు.కాంగ్రెస్ పాలనలో రైతులు ఎదుర్కొన్న కరెంటు కష్టాలను అంత తొందరగా ఎలా మర్చిపోతామని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కరెంటు కష్టాలకు శాశ్వత చమర గీతం పాడాలని ముఖ్యమంత్రి కలలు కన్నారని పేర్కొన్నారు.రాష్ట్రం ఏర్పడిన అనంతరం సాగు రంగాన్ని సంక్షోభం నుండి బయట పడేయాలని నీటి రంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి ఎన్నో విప్లాత్మకమైన పథకాలను తీసుకువచ్చారని తీసుకువచ్చారని తెలిపారు. 4.50 లక్షల కోట్లను ఖర్చు చేసి సరికొత్త రికార్డును సృష్టించారని తెలిపారు. 3 పంటలు పండించాలని తెలంగాణ రాష్ట్రం సంకల్పం చేస్తుంటే మూడు గంటలు కరెంటు చాలు అని కాంగ్రెస్ పేర్కొనడం ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అర్ధరాత్రి అపరాత్రి రైతులు పొలాల వద్దకు వెళ్లి అనేక సందర్భాలలో ప్రాణాలు కోల్పోయారని తిరిగి అదే పునరావృతం చేసే ఆలోచనలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాట్లాడడం సిగ్గుచేటు అన్నారు. రైతున్నలను రాజును చేసి వారి ముఖంలో ఆనందాన్ని చూడడమే ముఖ్యమంత్రి సంకల్పమని అందుకే రైతులకు అడగుమందు నుండి మొదలుకొని వారు పండించిన ధాన్యాన్ని కల్లాల వద్ద కొనుగోలు చేసి వారి ఖాతాల్లోకి డబ్బులు జమ చేస్తున్నారని అన్నారు. గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు రైతులకు యూరియా అడుగుమందు పెటిసైడ్స్ సీడ్స్ లభించేవి కాదని హరి గోసలు పడి పండించిన ధాన్యాన్ని విక్రయించాలన్న నాన్న అవస్థలు పడేవారని విక్రయించిన ధాన్యానికి తిరిగి డబ్బులు పొందేందుకు బ్యాంకుల వద్ద చెప్పులు లైన్‌లో పెట్టి నిలబడ్డ సందర్భాలు ఉన్నాయన్నారు. రైతులను ఇబ్బందులకు గురి చేసేందుకే కాంగ్రెస్ ప్రయత్నం అని పేర్కొన్నారు. అలాంటి కాంగ్రెస్ ను నమ్మి రైతులు ప్రజలు తిరిగి పాతరోజులు రాకుండా చూడాలని అన్నారు. ప్రస్తుతం ప్రజల వద్దకు తీరొక్కావేషాలతో కాంగ్రెస్ పార్టీ నాయకులు వస్తున్నారని అలాంటి వారి మాటలు నమ్మి గోసపడవద్దని పేర్కొన్నారు. 60 సంవత్సరాల కాలంలో చేయన టువంటి అభివృద్ధి కేవలం 9 సంవత్సరాల కాలంలోనే అభివృద్ధిని చేసి చూపించిన పార్టీ బిఆర్ఎస్ పార్టీ అని ప్రజలకు మెరుగైన సౌకర్యాలను అందిస్తూ నిత్యం రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పయనింప చేసే విధంగా ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు కృషి చేస్తున్నారని అన్నారు. గతంలో ఏ ప్రభుత్వాలు ఇలాంటి సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రవేశపెట్టిన దాఖలాలు లేవని ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రాన్ని యావత్ భారతదేశం గర్వించదగ్గ స్థాయికి తీసుకువెళ్లిన ముఖ్యమంత్రి అని తెలంగాణ రాష్ట్రంలో ప్రతి ఇంటికి ఒక సంక్షేమ పథకాన్ని అందించి ప్రజలు ఇబ్బందులు పడద్దని సంకల్పంతో పాలన సాగిస్తున్నారన్నారు. సంక్షేమ అభివృద్ధి పథకాలలు భారత దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణ రాష్టంలో అమలవుతున్నాయని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో స్మశాన వాటికలు డంపింగ్ యార్డులు ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. గతంలో గ్రామాలలో ప్రజలు నానా ఇబ్బందులు పడేవారని ప్రస్తుతం ప్రతి గ్రామం నుండి మండల హెడ్ కోటర్ వరకు అధునాతన సౌకర్యాలు గల రహదారుల నిర్మాణాలు చేపడుతూ ముందుకు పోతున్నామని పేర్కొన్నారు. కళ్యాణ లక్ష్మీ ,షాధీ ముబారక్ పథకాలతో పాటు అంగవైకల్యం వృద్ధవ్య



వికలాంగ,వితంతు,బోదకాలు నేతన్న గీతన్న ఒంటరి మహిళ ఇలా అనేక పెన్షన్లను అందిస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్నారు. వీటితో పాటు ప్రజలకు అనేక సౌకర్యాలను కల్పించి మెరుగైన ఆసుపత్రుల సౌకర్యాన్ని ఏర్పాటు చేపడుతున్నామని పేర్కొన్నారు. గతంలో ప్రభుత్వ ఆసుపత్రుల పరిస్థితి ఏవిధంగా ఉండేదో ప్రజలకు తెలుసునని ప్రస్తుతం ఎలాంటి సౌకర్యాలు ఆసుపత్రిలలో లభిస్తున్నాయో ప్రజలందరూ గమనిస్తున్నారని అన్నారు. గర్భిణి స్త్రీ నుండి మొదలుకొని ప్రసవం అయ్యేంతవరకు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యపరీక్షలు నిర్వహిస్తూ వారికి సాధారణ ప్రసవం నిర్వహించి కేసీఆర్ కిట్లను అందిస్తున్నామని తెలిపారు. రెప్పపాటు కరెంటు పోని గ్రామాలను నేడు మనం చూస్తున్నామని గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు గ్రామాలలో ఉదయం నుండడి సాయంత్రం వరకు కరెంటు ఉన్న దాఖాలాలు లేవని ప్రస్తుతం ఏ గ్రామంలో కరెంటు కోతలు లేవని అనాన్రు. తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకువెళ్లి ప్రతి గ్రామంలో కూడలిలలో నలుగురు ఒక చోట చేరిన సందర్భాలలో విస్తృత ప్రచారాన్ని చేపట్టి తిరిగి ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు కి మూడోసారి అధికారాన్ని అందించి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకువెళ్లేలా పార్టీ ప్రజా ప్రతినిధులు నాయకులు కార్యకర్తలు కృషి చేయాలని ప్రజల ఆశీర్వాదంతో తిరిగి మూడోసారి అధికారం చేపడతామని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సమితి జిల్లా అధ్యక్షులు కాసర్ల అనంతరెడ్డి,ఎంపీపీ పొన్నమనేని బాలాజీరావు,మున్సిపల్ చైర్ పర్సన్ ముత్యం సునీత రమేష్,రైతు సమితి మండల కో ఆర్డినేటర్ బోయిని రాజ మల్లయ్య,మండల పార్టీ అధ్యక్షుడు ప్రేమచందర్‌రావు,ఎఎంసి చైర్మన్ బుర్ర మౌనిక శ్రీనివాస్;కెడిసిసిబి డైరెక్టర్ శ్రీగిరి శ్రీనివాస్,పిఎసిఎస్ చైర్మెన్ జూపల్లి సందీప్‌రావు,సీనియర్ నాయకులు తిప్పారావు దయాకర్, కన్వీ నర్‌లు మైలారం నారాయణ,శ్రీనివాస్‌రెడ్డి,పట్టణాధ్యక్షులు పారుపెల్లి గుణపతి, ఎంపీటీసీ నిర్మల ఓదెలు,ఉపసర్పంచ్ రాజు,మాజీ ఎంపీటీసీ మార్కెట్ డైరెక్టర్ సంపత్,సర్పంచ్‌లు స్వప్న అరుణ్,స్వరూప తిరుపతి,ఎంపిటిసి ఫక్కీర్‌యాదవ్ ,కౌన్సిలర్‌లు గొట్టం లక్ష్మీ(మహేష్),పసిడ్ల మమత సంపత్,రైతు సమితి కో ఆర్డినేటర్ లు శ్రీనివాసరావు,అమ్ముల భూమయ్య,మార్కెట్ డైరెక్టర్ బోయిని ముత్యాలు ,గ్రామశాఖ అధ్యక్షుడు సదయ్య, బొంకూరి ఐలయ్య, రైతులు, గ్రామస్థులు,బిఆర్ఎస్ ప్రజాప్రతి నిధులు, నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

---

## పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తోన్న వారిపై చర్యలు చేపట్టాలి



గోదావరిఖని, జులై 18 (మనం న్యూస్): రామగుండం నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీకి వ్యతిరేకంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న వారిపై తగిన చర్యలు తీసుకోవాలని రామగుండం దళిత బంధు లబ్దిదారులు బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ను కోరారు. మంగళవారం గోదావరిఖని తిలక్ నగర్ లోని ఓ ఫంక్షన్ హాల్లో దళిత బంధు లబ్ధిదారులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొద్ది రోజులుగా బిఆర్ఎస్ పార్టీకి వ్యతిరేకంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్న పాలకుర్తి జెడ్పిటిసి కందుల సంధ్యా రాణి,కార్పోరేటర్ పాతిపెల్లి లక్ష్మి ఎల్లయ్య,మాజీ మేయర్ కొంకటి లక్ష్మీనారాయణ, టిబిజికెఎస్ జనరల్ సెక్రటరి మిర్యాల రాజిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ బయ్యపు మనోహర్ రెడ్డిలపై చర్యలు తీసుకోవాలని కేటీఆర్ ని వారు కోరారు. అలాగే రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ను ఎవరైనా ఇబ్బందులకు గురి చేస్తే తాము ఊరుకోబోమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో నీరటి శ్రీనివాస్, ఇరుగురాళ్ల శ్రావన్,బాసంపెల్లి శ్రీనివాస్, కొలుగూరి సాయి కుమార్,దాసరి హరికృష్ణ, ఓదేలు,కొడి రామకృష్ణ,ఆయుల్ల నాగరాజు, అనంతుల రవికుమార్,నల్లాల ప్రవీన్ తదితరులు పాల్గొన్నారు.

---

## ఆరవ వార్డు అభివృద్ధిని పట్టించుకోరా..?

### బిజెపి పట్టణ కార్యదర్శి రాజేందర్

కోరుట్ల జులై 17 (మనం న్యూస్): కోరుట్ల పట్టణ విలీన గ్రామమైన యకీన్పూర్ ఆరో వార్డు అభివృద్ధి గురించి పట్టించుకున్న నాథుడే కరవయ్యాడని బిజెపి పట్టణ కార్యదర్శి ఎర్ర రాజేందర్ వ్యాఖ్యానించారు. గ్రామపంచాయతీ ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి పనులు తప్ప మున్సిపల్ లో విలీనమైన నాటి నుండి ఎలాంటి అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వార్డులో మురికి కాలువలు లేక రోడ్లపై నీరు ప్రవహించి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సరైన సిసి రోడ్లు నిర్మాణానికి నోచుకోవడం లేదని ఇప్పటివరకు చెత్త బుట్టల పంపిణీ కూడా వార్డులోని ప్రజలందరికీ అందజేలేదని, పారిశుద్ధ్యం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైందని విమర్శించారు. విలీనం నాటినుండి విద్యుత్ బిల్లులు ఇంటి పన్నులు పెరిగాయే తప్ప అభివృద్ధి మాత్రం ఆమడ దూరంలో ఉందని వార్డును పట్టించుకునే వారే లేరని స్పష్టం చేశారు. భగీరథ నీరు కూడా చెరువు నీటిని తలపిస్తూ తాగేందుకు ఏమాత్రం అనుకూలంగా లేవని అలాంటి భగీరథ నీటి సరఫరా కూడా అన్ని చోట్ల లేదని ఆరోపించారు. ఇలాంటి నిర్లక్ష్యపు పాలకులపై అధికారు లు దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని, లేనియెడలో రాబోయే ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఇప్పటికైనా అధికారులు, పాలకవర్గం స్పందించి వార్డులోని ప్రధాన సమస్యలు తీర్చాలని ఎర్ర రాజేందర్ డిమాండ్ చేశారు.



# స్పష్టమైన ఓటరు జాబితా తయారీలో..

# బూత్ స్థాయి అధికారుల పాత్ర కీలకం

### కలెక్టర్ బదావత్ సంతోష్

మంచిర్యాల, జులై 18 (మనం న్యూస్): స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించడంలో బూత్ స్థాయి అధికారుల పాత్ర కీలకమైందని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బదావత్ సంతోష్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లోని సమీకృత జిల్లా శాఖల కార్యాలయాల భవన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు డి. మధుసూదన్ నాయక్, బి. రాహుల్, ట్రైనీ కలెక్టర్ పి. గౌతమి, మంచిర్యాల, బెల్లంపల్లి మండల అధికారులు దాసరి వేణు, శ్యామలాదేవి లతో కలిసి అసెంబ్లీ, జిల్లా స్థాయి శిక్షకులతో ఓటరు జాబితా రూపకల్పన పై బూత్ స్థాయి అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బి ఎల్ ఓ యాప్, ఎలాంటి పొరపాట్లు లేని స్పష్టమైన ఓటరు జాబితా



రూపొందించడంలో బూత్ స్థాయి అధికారుల పాత్ర కీలకమైనదని అన్నారు. జిల్లాలో 2వ ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులకు, ఆపరేటర్లకు అందిస్తున్న ఈ శిక్షణను పూర్తి స్థాయిలో నేర్చుకుని పకడ్బందీగా అమలు చేయాలని తెలిపారు. జిల్లాలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు నమోదు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

సవరణలు, చిరునామా మార్పులు, మృతి చెందిన వారి ఓట్ల తొలగింపులు సంబంధించి భారత ఎన్నికల సంఘం నిబంధనల మేరకు చర్యలు చేపట్టాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో బూత్ స్థాయి అధికారులు, ఆపరేటర్లు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.


మనం
జనం కోసం... అక్షర యజ్ఞం...
తెలుగు దినపత్రిక

కావలెను

'మనం' తెలుగు దినపత్రికకు ఈ దిగువ పేర్కొన్న సర్కిల్స్ పరిధిలో విలేకరులుగా పనిచేసేందుకు ఉత్సాహవంతులు కావలెను. చక్కటి రాత, తెలుగుభాషపై పట్టు ఉండి ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులు కోరబడుతున్నవి.

కావలసిన ప్రాంతాలు :

**మంచిర్యాల జిల్లా:** మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి, నస్పూర్, హాజీపూర్, లక్షేటిపేట్, దండెపల్లి, జన్నారం, కోటపల్లి, వేమనపల్లి, జైపూర్, భీమారం, కన్నెపల్లి, నెన్నెల్, భీమిని, తాండూర్, కాసిపేట,

**ఆసిఫాబాద్ జిల్లా:** కాగజ్‌నగర్, సిర్పూర్(టి), కౌటాలా, చింతలమానెపెల్లి, పెంచికలపేట్, బెజ్జూరు, దహేగాం, రెబ్బెన. వాంకిడి, జైనూర్, కెరమెరి, సిర్పూర్(యు), తిర్యాని.

మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

**నిర్మల్ జిల్లా:** నిర్మల్, ముధోల్, ఖానాపూర్ నియోజక వర్గాలు మరియు మండలాల వారిగా

**ఆదిలాబాద్ జిల్లా:** అదిలాబాద్, బోథ్ నియోజక వర్గాలు మరియు మండలాల వారిగా

మనం
జనం కోసం... అక్షర యజ్ఞం...
తెలుగు దినపత్రిక

పూర్తి వివరాలకై సంప్రదించవలసిన ఫోన్ నం:

సెల్ : 96666 99086, 83339 98076